క్లుప్తంగా

స్పౌజ్ పింఛన్ల పంపిణీలో జాప్యం

కొలిమిగుండ్ల: పింఛన్ తీసుకుంటున్న భర్త మృతి చెందిన భార్యకు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో అధికారులు జాబితా తయారు చేశారు. మండలంలో 89 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి జూన్ 12వ తేదీ పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించి వాయిదా వేశారు. పింఛన్ డబ్బులు జమ అయినా హోల్డ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. లబ్ధిదారులు మాత్రం 1వ తేదీ సాధారణ పింఛన్లతో పాటు ఇస్తారని ఆశలు పెట్టుకున్నారు. అప్పుడు కూడా ఇవ్వకపోవడంతో నిరాశ చెందారు. వాయిదాలు వేస్తూ జాప్యం చేయడంతో ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

రేపు మెగా లోక్ అదాలత్

కోవెలకుంట్ల: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు తెలిపారు. కోర్టు పరిధిలో రాజీ సాధ్యమైన అన్నిరకాల సివిల్, క్రిమినల్ కేసులు లోక్‌అదాలత్ ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వంట ఏజెన్సీ మార్పుపై తల్లిదండ్రుల సమావేశం



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

బేతంచెర్ల: మండలంలోని కొమ్మూరి కొట్టాల ప్రాథమిక పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలిగా ఉన్న నాగలక్ష్మమ్మను తొలగించాలని తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఎంఈఓ సోమశేఖర్, హెచ్‌ఎం జ్యోత్స్నతో కలిసి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు అరకొరగా అన్నం పెడుతున్న నాగలక్ష్మమ్మను తొలగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వారి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని, హెడ్ కుక్‌గా కాశమ్మ, అసిస్టెంట్ కుక్ ప్రభావతిని ఎంపిక చేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఎంపికైన వారిని ఎంపీడీఓకి ఆమోదార్థం పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన నిబంధనలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థులను ప్రతిరోజూ పాఠశాలకు పంపాలని సూచించారు.

నివాళులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత అంబటి రామ్మోహన్‌రెడ్డి తల్లి రామలక్ష్మమ్మ(80) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. వ్యాపారాల నిమిత్తం రామ్మోహన్‌రెడ్డి తాడిపత్రిలో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు పేరం నందకిషోర్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ వింగ్ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, ఆదాం, పాస్టర్లు దేవసహాయం, జాన్సన్‌బాబు, ప్రవీన్‌కుమార్, రాజు, పౌలు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు, స్థానికులు

బేతంచెర్ల: స్థానిక డోన్ రోడ్డులోని దుర్గాపేట సమీపంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దుర్గాపేట కాలనీవాసులు, సీపీఐ నాయకులు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. టవర్‌తో రేడియేషన్ వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

నిరుపయోగంగా ప్రభుత్వ గోదాములు

- వైఎస్సార్‌సీపీ హయాంలో బహుళ ప్రయోజన గోదాములు
- ఆకుమల్ల, పేరుసోమలలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మాణం
- ఆకుమల్లలో పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



ఆకుమల్లలో నూతనంగా నిర్మించిన గోదాము

సంజామల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం లక్షలు వెచ్చించి బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను నిర్మించింది. రైతులు పండించిన పంటను భద్రపరుచుకోవడానికి వీలుగా ఆకుమల్ల, పేరుసోముల గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసింది. గోదాము నిర్మాణ పనులు పూర్తయి దాదాపు ఏడాది అవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదాము ప్రారంభిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వాపోతున్నారు.

500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం

ఆకుమల్ల, పేరుసోమల గ్రామాల్లో రూ.45 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించారు. ఆకుమల్లలో నిర్మాణ పనులు పూర్తయి ప్రాథమిక సహకార సంఘానికి అప్పగించారు. పేరుసోముల గ్రామంలో నిర్మాణంలో ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అన్నదాతలు తాము పండించిన పంటను నిల్వ చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. గోదాము ప్రారంభిస్తే పంటను నిల్వ చేసుకుని మంచి ధర లభించినప్పుడు అమ్ముకునే వీలు కలుగుతుంది. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. సిద్ధంగా ఉన్న గోదామును కూడా ప్రారంభించకుంటే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ కక్షతో తమను ఇబ్బంది పెట్టడం సరికాదని వాపోతున్నారు.

త్వరగా ప్రారంభించాలి



రైతుల సౌకర్యార్థం నిర్మించిన బహుళ ప్రయోజ గోదాములు త్వరగా ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తేవాలి. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటను నిల్వ చేసుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా గోదాముల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. రైతుల సమస్యలపై ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

–గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, ఆకుమల్ల ప్రాథమిక సహకార సంఘం మాజీ చైర్మన్

గత ఏడాది ధరలేదు.. గోదాము లేదు



గత ఏడాది పండించిన పంటకు గిట్టుబాటు ధరలేదు. పండించి పంటను గోదాములో నిల్వ చేసుకుందామనుకుంటే గోదాము ప్రారంభించలేదు. ఇప్పటికైనా ప్రారంభిస్తే గిట్టుబాటు ధరలేనప్పుడు గోదాములో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

–శ్యాముడు,రైతు, ఆకుమల్ల గ్రామం

ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం

రైతులు పండిన పంటలను నిల్వ చేసుకోవడానికి ఆకుమల్లలో రూ.45 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించారు. గోదాము మైనర్ పనులు మిగిలి ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే రైతులకు అందుబాటులోకి తెస్తాం. ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు.

–చంద్ర శేఖర్ రెడ్డి, సీఈఓ, ఆకుమల్ల సహకార సంఘం

ఆర్టీసీలో డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

డోన్ టౌన్: ఆర్టీసీలో అవసరమైన సమయంలో డ్రైవర్లుగా (ఆన్ కాల్ డ్రైవర్లు) విధులు నిర్వ హించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్సు కలిగి కనీసం 18 నెలల అనుభవం, ఆర్టీఓ కార్యాలయంలో క్లియరెన్స్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి 25 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 7వ తేదీలోపు డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఉర్దూ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ గురువారం తెలిపారు. అభ్యర్థులు ఎంఏ ఉర్దూ చదివి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 7వ తేదీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా చిన్నసరిగెత్తు



హజరత్ అబ్బాస్ పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లెలో ఇమాంఖాసీం పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

బనగానపల్లెరూరల్: మొహర్రం వేడుకల్లో భాగంగా బనగానపల్లెలో గురువారం రాత్రి చిన్నసరిగెత్తు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఆస్థానంలో కొలువైన హజరత్ అబ్బాస్ పీర్లు, దొరకోట పీర్లు, బొమ్మల పీర్లు, పోలీసు సర్కిల్ కార్యాలయం వద్ద ఉన్న ఇమాం ఖాసిం పీర్లతో పాటు పలు చావిడిల్లో కొలువైన పీర్లను హిందూ, ముస్లింలు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట ఉన్న ఇమాం ఖాసిం పీర్ల వద్ద భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి భక్తిభావం చాటారు.

ఫాతెహాలు సమర్పించిన కాటసాని

బనగానపల్లె: పట్టణంలోని పలు పీర్ల చావిడీలను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు. బొమ్మల పీర్ల చావిడి, ఆస్థానంలోని హజరత్ అబ్బాస్ పీర్లు, సర్కిల్ కార్యాలయం సమీపంలోని ఇమాంఖాసీం పీర్లను దర్శించుకుని పూలదట్టీలు సమర్పించారు. ఆయన వెంట నాయకులు అత్తార్ జాహెద్, అనీల్, సురేష్, ముక్తియార్, అమ్మబా, లారీ కరీం, మాబుసా, గౌస్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం చిన్న సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డిబావి వీధుల్లో పదిబోట్ల బీబీఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, చిన్నబార్‌ఇమాం, ఇమాంకాశీం, పెద్దబార్‌ఇమాం, హజరత్ అబ్బాస్, హజరత్ అలీ అబ్బాస్, దస్తగిరి స్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం పీర్ల దేవుళ్లను కొలువుంచారు. చిన్న సరిగెత్తును పురస్కరించుకుని మెయిన్ బజార్‌లో పీర్ల ఊరేగింపు జరిగింది. భక్తులు పీర్ల దేవుళ్లకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం మధ్య సరిగెత్తును నిర్వహించనున్నారు.

ముస్తాబైన పీర్ల చావిళ్లు

అవుకు: మొహర్రం పండుగలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని పీర్ల చావిళ్లను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అవుకులో తొమ్మిది చావిళ్లలో పీర్ల దేవుళ్లు కొలువుదీరాయి. శుక్రవారం చిన్న సరిగెత్తు, 5వ తేదీ మధ్య సరిగెత్తు, 6వ తేదీ పెద్ద సరిగెత్తు, 7వ తేదీ మొహర్రం పండుగ ఉంటుందని మతపెద్దలు తెలిపారు.





కోవెలకుంట్లలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు, అవుకు: విద్యుద్దీపాలంకరణలో ఖాజా బందేనవాజ్ పీర్ల చావిడి

వ్యక్తిగత ప్రయోజనాలే కూటమి నాయకులకు ముఖ్యం

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు సరికాదు
- వైఎస్సార్‌సీపీ నేతల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్షలో వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: వ్యక్తిగత స్వలాభం కోసమే పట్టణ నడిబొడ్డున ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జనసంచారం లేని శివారు ప్రాంతానికి తరలించే కుట్ర జరుగుతోందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆరోపించారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ నేతలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల లబ్ధి కోసం ప్రభుత్వ కార్యాలయాలను తరలించేందుకు తహతహలాడుతోందని విమర్శించారు. ప్రైవేటు వ్యక్తుల రియల్ ఎస్టేట్ వెంచర్లను అభివృద్ధి చేయాలనే కుట్రతో కూటమి నాయకులు ఇలాంటి నీతిబాహ్యమైన పనులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన క్లబ్‌హౌస్‌ను కూటమి నాయకులకు కట్టబెట్టేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల అవసరం కోసం టీడీపీ నాయకులు సొంత వాహనాలను అద్దెకు ఇచ్చి లబ్ధి పొందుతున్నారన్నారు. గత ప్రభుత్వం హయాంలో డోన్ రెవెన్యూ క్వార్టర్స్‌లో రూ. కోటి వ్యయంతో నిర్మించిన భవనంలోకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, సుంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, పార్టీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, వంశీ, గద్దం సురేష్, బాషా, హరీష్‌లు కూర్చున్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టుప్రసాద్, యువజన విభాగం అధ్యక్షుడు రాజవర్ధన్, పార్టీ లీగల్‌సెల్ నాయకులు నారాయణ, నరసింహులు, మధుసూదన్‌రెడ్డి, నాయకులు చిరంజీవి, రైల్వే నాగేంద్ర, వెంకట్రాముడు, లక్ష్మంపల్లె ఓబులేసు, బొబ్బల శివరామిరెడ్డి, మహేంద్రనాయుడు, షేక్షా, రఫి, రమణారెడ్డి, మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం సంఘీభావం

వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని గురువారం సీపీఎం నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. వీరిలో సీపీఎం మండల కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఏఐటీయూసీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, మద్దయ్య, షమీంబేగం ఉన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ



బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పిలువ బడుతున్న కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది. పట్టణానికి చెందిన బీవీ ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పదవులకు వన్నె తెచ్చారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో పట్టణానికి చెందిన బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్ పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్‌అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొత్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందడమేకాక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. శుక్రవారం ఆయన వంశస్థులు పట్టణంలో బీవీ సుబ్బారెడ్డి 122 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు సమయపాలన తప్పనిసరి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. గురువారం చెరువుపల్లె గ్రామంలోని ఎంపీపీ ఉర్దూ, తెలుగు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చదవడం, రాయడం వచ్చేలా బోధించాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి స్టూడెంట్స్ కిట్లు పంపిణీ పూర్తకావాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. ఎస్‌ఎస్‌ఏ కోఆర్డినేటర్ జగన్‌మోహన్‌రెడ్డి, హెచ్‌ఎంలు అబ్దుల్ రహీం, భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

బేతంచెర్ల: పాఠశాల విద్యలో ఉత్తమ ఫలితాలు రావాలంటే ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన బేతంచెర్లలోని హరిజనవాడ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, హాజరు శాతం పరిశీలించారు. విద్యార్థులకు పలు విద్యా సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఎంఈఓ సోమశేఖర్, హెచ్‌ఎం పుల్లయ్య పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



పట్టణంలో జగన్నాథ రథయాత్ర

డోన్ టౌన్: ఇస్కాన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం డోన్ పట్టణంలో జగన్నాథ రథ యాత్ర శోభాయమానంగా జరిగింది. పాతపేట రామాలయం నుంచి అమ్మవారిశాల, కర్నూలు రైల్వేగేట్లు, వినాయక గుడి, పాత బస్టాండ్ మీదుగా వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు రథ యాత్ర సాగింది. జగన్నాథుని రథాన్ని లాగేందుకు ప్రజలు పోటీపడ్డారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తి ప్రవచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పైపులైన్ మరమ్మతు పనులు

బేతంచెర్ల: పట్టణానికి సమీపంలోని నంద్యాల రహదారిలో ఉన్న గోరుకల్లు రిజర్వాయర్ పైపులైన్ పగిలిపోయి వారం నుంచి నీరు వృథా అవుతోంది. ఎవరూ పట్టించుకోకపోవడంతో సమాచారం తెలుసుకున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి రెడ్డి గురువారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. వెంటనే నగర పంచాయతీ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. దీనిపై పట్టణ ప్రజలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయం ప్రారంభించాలి

డోన్ టౌన్: గత ప్రభుత్వ హయాంలో డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించి అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డికి విన్నవించారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్ణప్రతాప్, నాయకులు ప్రవీణ్, అస్లాం, ధనుష్, అరుణ్, కుళ్లాయి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: వెంకటాపురం రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా మల్లెంపల్లె ఫీడర్, హైవే ఫీడర్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శ్రీరామనగర్, టీచర్స్‌కాలనీ, వైఎస్సార్ నగర్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నగర్, నల్లగుట్ట, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌తో పాటు లక్ష్మంపల్లె, మల్లెంపల్లె గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి 10 గంటల వరకు.. మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. అలాగే ఇండస్ట్రియల్ ఎస్టేట్ కోట్లవారిపల్లె సబ్‌స్టేషన్‌లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున ధర్మవరం, కన్నపకుంట, చింతలపేట, గోసానిపల్లెలో రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 9 గంటల.. రాత్రి 9 నుంచి 12 గంటల వరకు ఇస్తామన్నారు.

జయప్రదం చేయండి

ప్యాపిలి: సీపీఐ మండల సమితి మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, మండల కార్యదర్శి వెంకటేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్యాపిలిలో నిర్వహించే మండల సమితి మహాసభలకు తరలిరావాలని కోరారు.

పండ్లతోటలను సద్వినియోగం చేసుకోండి

సంజామల: మండలంలోని రైతులు పండ్లతోటల నాటుకుని లాభాల బాటలో నడవాలని ఏపీఓ జయంతి అన్నారు. మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. పండ్లతోటలను నాటుకునే రైతులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. మూడేళ్ల వరకు పండ్ల తోటలకు అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్‌లను సంప్రదించాలన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా, గోరుమానుకొండ, ముద్దవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను డ్వామా పీడీ సూర్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల హాజరు, చేస్తున్న పనులు, హార్టికల్చర్, కంపోస్టు గుంతలు, పశువుల నీటి తొట్లను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి కంపోస్టు గుంతలు తీసుకోవాలని, పశువులు ఉన్న రైతులు గోకులం షెడ్లు నిర్మించుకోవాలని, పండ్ల తోటల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలని రైతులకు సూచించారు. ఏపీఓ విజయ రాణి పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ

డోన్: 2025–26 ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం డోన్ మండల రైతులకు జీజేజీ–32 రకం వేరుశనగ విత్తనాలను కేటాయించింది. మొత్తం 375 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డు గోదాంలో వ్యవసాయ శాఖ ఉపసంచాలకురాలు సునీత ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఈ విత్తన రకం వర్షాభావ పరిస్థితులు, బెట్ట భూముల్లో సాగుకు అనుకూలంగా ఉండడంతో ప్రయోగాత్మకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు దీన్ని విశ్వసనీయంగా పండించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బెన్ని రాజు, వెంకట్రాముడు, సునీల్, విజయ్, కుసేనయ్య, రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



వైద్యులతో చర్చిస్తున్న డీసీహెచ్‌ఎస్

బేతంచెర్ల: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ లలిత సూచించారు. గురువారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రోగుల రికార్డులు, వార్డులో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రసవాలు, సిజేరియన్లు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వివరాలను తెలుసుకున్నారు. సీహెచ్‌సీలో ఎక్స్‌రే సేవలతో పాటు పోస్టుమార్టం కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా అందరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. సూపరింటెండెంట్ సాగరిక, వైద్యులు వెంకటేశ్వర్లు, సునీల్, ఇర్ఫాన్, దంత వైద్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బీఎస్ఎన్ఎల్ భవనం

మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ భవనం క్రమంగా శిథిలావస్థకు చేరకుంకుంది. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం నుంచి రెండు రోజులుగా పెచ్చులు ఊడి పడుతున్నాయి. ప్రస్తుతం ఈ భవనంలో ఆధార్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం ప్రతిరోజూ అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయానికి వస్తున్నారు. పెచ్చులు ఊడి పడుతుండడంతో ప్రజలు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–ప్యాపిలి



ప్రవేశ ద్వారం వద్ద ఊడిపడిన పెచ్చులు